www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 29 డిసెంబర్ 2024

5

చిత్తూరు

రెస్కో సంస్థపై చర్చకు సిద్ధమా..

ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

విలేకర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం రెస్కో సంస్థలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చర్చకు సిద్ధమా అంటూ తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్‌కు పత్రికా ముఖంగా సవాలు విసిరారు. కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుపై చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ కుప్పం పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని తప్పుపట్టారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రెస్కో సంస్థను నిర్వీర్యం చేశారని, అధికార హోదా లేకపోయినా అధ్యక్షునిగా కొనసాగిన వ్యక్తి సంస్థలో చేపట్టిన కార్యక్రమాల వల్ల సంస్థ నష్టాల పాలయ్యిందన్నారు. ఆయన హయాంలో పదవీ విరమణ పొందిన వ్యక్తిని తిరిగి విధులలో తీసుకోవడం జరిగిందన్నారు. వీటన్నింటినీ ఆనాటి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రెస్కో సంస్థ కనీసం రెన్యువల్‌కు నోచుకోలేదని, వీటన్నింటినీ ప్రశ్నించడం చేతకాని వ్యక్తి, సార్వత్రిక ఎన్నికల అనంతరం కుప్పం నియోజకవర్గ పరిధిలో తన ఉనికిని కోల్పోవడం జరిగిందని, వైసిపిలో సైతం భరత్ ఉన్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వైసిపి నాయకులే తమ వైసిపి సమన్వయ కర్తను మార్చాలనడం అతని ఉనికిని కోల్పోవడానికి నిదర్శనం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తన ఉనికిని చాటుకోవడానికి మాత్రమే కుప్పం పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీకి ఉంటే రెస్కో అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మనోహర్, వల్లేప్ప, రవి, భాగ్యలక్ష్మి త్రిలోక్, సుగుణమ్మ, ప్రశాంత్, పాల్గొన్నారు.

40 కేజీల శ్రీగంధం స్వాధీనం

11 మంది అరెస్ట్

అరెస్టు చేసిన ముద్దాయిలను చూపుతున్న అటవీశాఖ అధికారిణి భరణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఎర్రచందన స్మగ్లింగ్ ముఠాపై నిఘా పెట్టిన ఫారెస్ట్ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు బస్సులో కర్ణాటక రాష్ట్రానికి శ్రీగంధాన్ని తరలిస్తున్న వారిని శనివారం బస్సును తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. సదరు నిందితుడు నుంచి అందిన సమాచారం మేరకు నగరంలో వివిధ చోట్ల నిర్వహించిన సోదాల్లో 11మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 40 కేజీల శ్రీగంధం చెక్కలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారిని భరణి తెలిపారు. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి చిత్తూరు పరిసర ప్రాంతాల్లో శ్రీగంధం చెక్కలను సేకరించి కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. త్వరలోనే ముఠా నాయకుడిని పట్టుకునేందుకు అటవీశాఖ నిఘా ఉంచినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

5వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పీఈఎస్ పబ్లిక్ పాఠశాల వేదికగా రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ఈనెల 28వ తేదీన ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగిందని పాఠశాల యాజమాన్యం తెలియజేసింది. పీఈఎస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎంఆర్.దొరస్వామి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో కూడా గొప్పగా రాణిస్తే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని తెలిపారు. 2018లో ఈ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు గొప్పస్థాయిలో ప్రారంభం చేశారని, ఐదవ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ముఖ్యఅతిథిగా బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ టి.చెంగల్రాయ నాయుడు విచ్చేసి శాంతి పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నిరంతర అభ్యాసం అవసరమని, ఉదయం సాయంత్రం తప్పక ఆటల మీద శ్రద్ధ పెట్టాలని క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాంతాల నుండి 35కు పైగా జట్టులు పాల్గొన్నాయి. బాస్కెట్ బాల్ పోటీలు రేపటి వరకు కొనసాగి చివరికి విజేతలైన వారికి బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. పిఈఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ సత్యనారాయణ, డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

ప్రజాశక్తి- రొంపిచర్ల: కల్లూరు సర్కిల్‌లోని రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌ను శనివారం చిత్తూరు డీఎస్పీ టి.సాయినాథ్ పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను, కేసుల రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలను మర్యాదపూర్వకంగా పరిష్కారం చూపాలన్నారు. పేకాట, కోడి పందేలు ఆడేవారిని నిష్పక్షపాతంగా కేసులు పెట్టేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలరకాల సూచనలు సలహాలు ఇచ్చారు. సబ్ ఇన్స్పెక్టర్ బి.సుబ్బారెడ్డి, ఏఎస్ఐలు తులసీరామ్, మధు, హెడ్ కానిస్టేబుల్ రెడ్డప్ప రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ కే.సురేష్, వేణు, కార్తీక్, పురుషోత్తం, రవి పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే..!

- గుంతలమయమైన రోడ్లు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- సూచిక బోర్డులు లేక ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు

గుంతలమయమైన రోడ్లపై వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఆ రహదారిపై రోడ్డు సాఫీగా గుంతలు లేకుండా ఉందని వాహనదారులు ఆదమరిచి అతి వేగంతో వాహనాలు నడిపారో ఇక అంతే సంగతి. గుంతలమయైన రోడ్డులో ప్రమాదాల భారినపడి గాయాలపాలవ్వాల్సిందే.. ఈ రహదారుల్లో కొత్తగా ప్రయాణించే వారు తరచూ ఆ గుంతలు కనిపించక పడి లేచి వెళ్లక తప్పడం లేదు. ఇక్కడ ఎలాంటి సూచిక బోర్డును రోడ్డు రవాణా సంస్థ వారు ఏర్పాటు చేయలేదు.

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట కనం సమీపంలో ఆర్ అండ్‌బి రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న వానలకు గుంతలు ఏర్పడ్డాయి. ఓ చిన్నపాటి బావిలా ప్రయాణికులకు కనిపిస్తుంది. ఎంత నెమ్మదిగా వెళ్లిన ఆ గుంతల్లో పడుతూ లేస్తూ నాలుగు చక్రాల వాహనాలు, పెద్ద లారీలు, ఆర్టీసీ బస్సులు ఉయ్యాల మాదిరిగా అటు ఇటుగా ఊగుతూ ప్రయాణిస్తుంటారు. ఊరంతా ప్రయాణించి ఆరోడ్డు వద్దకు వచ్చేసరికి వాహనాలు నడిపే డ్రైవర్లకు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతాయి. కొంత వేగం పెంచినా వాహనాలు ఎటువైపు ఒరుగుతాయో తెలీదని అంటున్నారు డ్రైవర్లు.

పచ్చికాపల్లం నుంచి తిరుపతికి వెళ్లే ప్రధాన మార్గం ఇదే... పల్లిపట్టు, చిత్తూరు–కొత్తపల్లిమిట్ట మీదుగా వయా పచ్చికాపల్లం మీదుగా తిరుపతికి వెళ్లే దారి కూడా ఇదే. ఈ దారిలో నిత్యం ఎంతో రద్దీగా వాహనాలు రాకపోకలు ఉంటాయి. దైవదర్శనంకు తిరుమలకు వెళ్లే భక్తులు, సొంత పనుల నిమిత్తం తిరుపతి జిల్లాకు వెళ్లే ప్రయాణికులతో ఈ దారిలో నడిపే ఆర్టీసీ బస్సులు రద్దీగా ఉంటాయి. ఈ మండలానికి తిరుపతి జిల్లాకు 25 కిలోమీటర్లు దూరం మాత్రమే. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, కనీసం సూచిక బోర్డులను అయినా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గుంతలను పూడ్చి సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

- సాంబశివ, రైతు, గాజింకి, కార్వేటినగరం మండలం

మేము ఈ గుంతల దారిలో ప్రయాణించలేక నిత్యం అవస్థలు పడుతూనే ఉన్నాం. నిత్యం ఏదో ఒక పనిపై తిరుపతికి వెళ్లి వస్తూనే ఉంటాం. అలాంటి సమయంలో ద్విచక్రవాహనాలు తరచూ గుంతల్లోపడి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తిరుపతికి వెళ్లినా వచ్చినా ఎర్రగుంట కనం దగ్గరకు వస్తే ఆరోడ్డలో ఎలా ప్రయాణించాలా అని భయమేస్తుంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డకు మరమ్మతులు పనులు చేపట్టాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలి.

జాతీయ రహదారులపై

నెత్తుటి మరకలు

ప్రజా'దృష్టి'

- ప్రమాదాల నివారణ ఎప్పటికో..?
- జాతీయ రహదారుల్లో 24 బ్లాక్ స్పాట్స్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని జాతీయ రహదార్లు నెత్తువోడ్డుతున్నాయి. తరచూ చిత్తూరు– బెంగుళూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది తెలుగువారితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు మరణిస్తుంటే మరికొందరు తీవ్ర గాయాలకు గురై క్షతగాత్రులుగా మారుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్న చాలా సందర్భాల్లో ప్రమాదాలకు గల కారణాలపై ఆరా తీసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో జాతీయ రహదార్లపై ప్రమాదాలు పరిపాటిగా మారిపోతున్నాయి. జిల్లాలోని బెంగుళూరు – చిత్తూరు ఆరు లైన్ల జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం చోటు చేసుకున్న తిరుపతి ఆర్‌టిసి డిపో బస్సు ప్రమాదంలో ఆరు మంది మృతి చెందగా 25 మందికి పైగా గాయపడ్డారు.

జిల్లాలోని జాతీయ రహదారుల్లో 24 బ్లాక్ స్పాట్స్‌ను నేషనల్ హైవే గుర్తించింది. ఇక్కడ ప్రమాదాలు నివారణకు చేపట్టవలసిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఈ మేరకు గతంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో చర్చించి వెంటనే చర్యలు తీసుకోవాలని నిర్ణయించినా పూర్తిస్థాయిలో జాతీయ రహదార్లపై ప్రమాదాల నివారణ చర్యలు పూర్తి కాలేదు. జిల్లాలో 2024 నవంబర్‌లో 693 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే 364 మంది మృతువాత పడ్డారంటే జాతీయరహదార్లు పరిస్థితి ఎంతటి దయనీయ పరిస్థితికి అద్దంపడుతోంది. ఇలా రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి రూ.1.5 లక్షలు నగదు రహితంగా చికిత్స అందించే పథకం పై అవగాహన లేక అనేక మంది ప్రయివేటు ఆసుపత్రుల్లో లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాగే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో సమస్యాత్మక జంక్షన్స్, స్కూల్ జోన్లు, కాలేజీలు, హాస్పిటల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లైటింగ్, రంబుల్ స్టిక్స్ వంటి లేకపోవడంతో ద్విక్రవాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. 2024లో ద్విచక్రవాహన ప్రమాదాల్లో 117 మంది మరణించారు.

చిత్తూరు జిల్లాలో 349.3 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 347.9 కిలోమీటర్లు రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల అధికారులు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసి రోడ్లు ప్రమాదాలను నివారించాల్సిన అవసరముంది. మంచు కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయి. లైటింగ్ లేనిచోట లైట్లు ఏర్పాటు, రోడ్డు మలుపులు ఉన్న ప్రదేశాల్లో సైన్ బోర్డులు, జంగల్ క్లియరెన్స్ చేపట్టడం వల్ల ప్రమాదాలు తగ్గే అవకాముంది. ఈ దిశగా జాతీయ రహదారుల భద్రతా అధికారులు చర్యలు చేపట్టాలి. హెల్మెట్ వాడకంపై అప్పుడప్పుడూ తనిఖీల పేరుతో హడావిడి చేసే పోలీసులు హెల్మెట్ తప్పనిసరి చేయడం వల్ల ద్విక్రవాహన ప్రమాదాలు తగ్గించవచ్చు. ఈ దిశగా రోడ్డు భ్రదతా సమావేశాల్లో చర్చించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆడుతూ పాడుతూ.. ప్రతిభను ప్రోత్సహిస్తూ..

భళా.. బాలోత్సవం..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటీ: 'ప్రతిభను ప్రోత్సహిస్తూ.. అభిరుచులకు ఆలంబనగా' ఆడుతూ పాడుతూ బాలోత్సవం ఉల్లాసభరిత వాతావరణంలో వేడుకగా శనివారం ఉదయం ప్రారంభమయ్యింది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి తిరుపతి నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వేదికయ్యింది. జిల్లా నలుమూలల నుంచి హాజరైన వేలాదిమంది విద్యార్థులు తమ కళలను సృజనాత్మకంగా ప్రదర్శించారు. వివిధ వేషధారణలతో అలరించారు. బాలోత్సవం అధ్యక్షులు టెంకాయల దామోదరం అధ్యక్షతన, వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున సారథ్యంలో ఆడుతూ పాడుతూ బాలోత్సవం అలరించింది.

తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించడంతో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిలిపేసి, నివాళి అర్పించారు. ప్రారంభసభకు డిఈవో కెఎల్‌ఎన్ కుమార్, కస్తూర్బిగాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టరు పిసి రాయల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మొదటిగా డ్రాయింగ్ పోటీలను ప్రారంభించారు. ఒక్క చిత్రలేఖనంలోనే 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వెనువెంటనే వివిధ అంశాల్లో పలు వేదికల ద్వారా పలు రకాల పోటీలు ప్రారంభమయ్యాయి. నెహ్రుమున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం మొత్తం ఎటు చూసినా విద్యార్థులతో కిక్కిరిసింది. ఒక పక్క శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, దాన్ని ఆనుకునే దేశభక్తి గీతాలాపనలు, మరో పక్క జానపద కళా ప్రదర్శనలు, ఇంకోపక్క ఏకాపాత్రాభినయాలు, దాన్ని వెనకే వాయిద్యపోటీలు, దానికి సమీపాన ప్యాన్సీడ్రస్ పోటీలు, విశాలమైన మైదానంలో చిత్రలేఖనాలు, వ్యాసరచన పోటీలు. ఇలా ఎక్కడ చూసిన పిల్లల పోటీ కార్యక్రమాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. మొదటి రోజు సాయంత్రం ముగింపు సందర్భంగా ఉదయం నుంచి జరిగిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గీతా బాలసుబ్రమణ్యం, నెల్లూరు మునిలక్ష్మీ, తహిషీనా, రఫి, బాలాజీ ప్రసాద్ చౌదరి, తమటం రామచంద్రారెడ్డి, సోము రవికుమార్, నడ్డి నారాయణ, పయ్యావుల గురున్నాథం, పద్మజ, మునిశేఖర్, మోహన్‌మూర్తి, ఓవి రమణ, కెఆర్‌ఎస్ సుబ్రమణ్యం, ఎంఈవో బాస్కర్ పాల్గొన్నారు. 200 మంది ఈ బాలోత్సవాన్ని విజయవంతం చేసేందుకు నిర్వహణ బాధ్యత తీసుకోవడం గమనార్హం.

ఒత్తిడి దూరం చేసేలా 'ఆటవిడుపు' : కెఎల్‌ఎన్ కుమార్, డిఇఒ

పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం చదువులతో ఒత్తిడికి గురవుతూ ఉంటారని, అలాంటి వారికి ఈ బాలోత్సవం ఆటవిడుపుగా ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి కెఎల్‌ఎన్ కుమార్ అన్నారు. బాలోత్సవంలో ఎనిమిదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను చదువుతో పాటు ఇతరత్రా రంగాల్లోనూ ప్రోత్సహించాలన్నారు.

బడి పాఠాలే కాదు

టెంకాయల దామోదరం, గౌరవాధ్యక్షులు

పిల్లలకు కేవలం బడి... పాఠాలే కాదు వారి నైపుణ్యతను, సజనాత్మకతను గుర్తించి, మరింత చేయూతనిచ్చే కార్యక్రమం తిరుపతి బాలోత్సవం. మూడోసారి తిరుపతి వేదికగా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 8వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సంఘీభావ కార్యక్రమం వారి మానసిక వికాసానికి దోహదపడుతుంది.

ఓ సృజన వేదిక

నడ్డి నారాయణ, అధ్యక్షులు



నేటి సమాజంలో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాట వేసే తిరుపతి బాలోత్సవం ఓ సజన వేదిక. చిత్రలేఖనం పోటీల్లో పిల్లలు అద్భుతమైన చిత్రాలను గీసి అబ్బురపరిచారు. తిరుపతి బాలోత్సవం పోటీల్లో పాల్గొనాలని పది రోజులకు ముందు నుండి సెల్ఫోన్‌లను పక్కనపెట్టి పోటీల్లో రాణించడానికి విద్యార్థులు శ్రమించారని వారి తల్లిదండ్రులు చెప్పారు.

శాస్త్రీయ ఆలోచనలు వికసిస్తాయి

మల్లారపు నాగార్జున, వ్యవస్థాపకులు



తిరుపతి బాలోత్సవం వేదికగా నిర్వహించే కార్యక్రమాలు పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనలు వికసించడానికి దోహదపడతాయి. జానపద నత్యాలు, బొమ్మకు కథ, చదరంగం వంటి అంశాలు పిల్లల్లో వారి ఆలోచన, మెదడు మరింత వికసించడానికి ఉపయుక్తంగా ఉంటాయి. ఈ నవ సమాజానికి తిరుపతి బాలోత్సవం బీజం వేసింది.

అంచనాలను మించి ప్రతిభ చూపారు

మోహనమూర్తి, కార్యనిర్వాహకులు

వివిధ పోటీల్లో పిల్లలు అంచనాలను మించి ప్రతిభ చూపారు. ప్రతి పోటీల్లో పిల్లలు తమ నైపుణ్యతను చాటడానికి ఉత్సాహం చూపించడం మాకు సంతోషం కలిగించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రెండు విధాలుగా బహుమతి ప్రదానం చేయాలని నిర్ణయించాం. విద్యార్థుల ఆలోచన శక్తి తిరుపతి బాలోత్సవం ఖచ్చితంగా పెంచుతుంది.

వినూత్న ఆలోచనకు వేదికయ్యింది

నెల్లూరు మునిలక్ష్మి, కార్యనిర్వాహకురాలు

తిరుపతి బాలోత్సవం పిల్లల్లో వినూత్న ఆలోచన కలిగించింది. ఈ పోటీ ప్రపంచంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా పోటీ ఎదుర్కొనే శక్తిని విద్యార్థులు కూడగట్టుకోగలుగుతారు. ఇన్ని వేలమంది ఎంతో ఉత్సాహంగా బాలోత్సవం పిల్లల పండుగలు పాల్గొని వారి నైపుణ్యతను పెంచుకున్నారు. పిల్లల మానసిక ఎదుగుదలకు తిరుపతి బాలోత్సవం ఉపకరిస్తుంది.

నియోజకవర్గం చార్టెడ్ అకౌంటెంట్ జాబితాలో

మరో ఇద్దరు పలమనేరు సీఏలు

ప్రజాశక్తి- పలమనేరు

శుక్రవారం ఐసిఏఐ విడుదల చేసిన చార్టెడ్ అకౌంటెంట్ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో పలమనేరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పలమనేరుకు చెందిన రిషబ్ ఓస్వాల్ మొదటి ర్యాంకు, పట్టణానికి చెందిన శశి శ్రీనివాస్ సీఏ ఫైనల్‌లో ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యాడు. చిన్ననాటి నుంచి వీరిద్దరూ క్లాస్మేట్స్, ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు ఈ మాస్ హైస్కూల్లో విద్యను అభ్యసించారు. చిన్ననాటి నుంచి ఇద్దరు చదువులో చురుగ్గా ఉండేవారు. సిఏ ఫౌండేషన్‌లో ఆల్ ఇండియా ఒకటి, రెండు సీఎంఏ ఫౌండేషన్‌లో ఆల్ ఇండియా 1,3 సీఏ ఇంటర్లో ఆల్ ఇండియా 8,10 సీఎంఏ ఇంటర్లో ఆల్ ఇండియా 13 ర్యాంకులు సాధిస్తూ పలమనేరు ఖ్యాతిని దేశస్థాయిలో తీసుకుని వెళ్లి, కలకత్తాలో, ఇద్దరికీ రెండుసార్లు ఆ రాష్ట్ర గవర్నర్ చేత సన్మానం చేయించుకున్నారు.అదే ఒరవడిని కొనసాగిస్తూ సీఏ ఫైనల్‌లో కూడా ప్రథమ ర్యాంకును రిషబ్ సాధించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు రాజేష్ ఓస్వాల్ భగీరథి లక్ష్మీపతి వ్యాపారస్తులు కావడం గమనార్హం.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నూతన సంవత్సరంలో పోరాటాలకు సిద్ధం: సిఐటియు జిల్లా కమిటీ పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి సురేంద్రన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గతంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని శనివారం చిత్తూరు సిఐటియు కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్త అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు స్కీం వర్కర్లు అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్ని రకాల కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని ఆరునెలలు అవుతున్నా వాటి జోలికి వెళ్లకపోవడం సరైనది కాదన్నారు. వేతనాలు పెరుగుతాయని ఆశతో గత వైసిపి ప్రభుత్వంను సాగనంపడంలో కార్మికుల పాత్ర కీలకమైందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుంటే వాటిని రాష్ట్రంలో కూడా అమలు చేయడం ఏమిటంటే ప్రశ్నించారు. కార్మికుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమన్నారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కార్మిక వర్గం నూతన సంవత్సరంలో తమ హక్కుల కోసం సిఐటియు చేసే పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ, ఆశ, వీవోఏ, మధ్యాహ్న భోజనం, ఇతర స్కీం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై నూతన సంవత్సరంలో పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు గంగ, జ్యోతిరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టేలర్ హైస్కూల్ ఆధ్వర్యంలో సైకిల్ రేసు

సైకిల్ రేసును ప్రారంభిస్తున్న సురేష్ బాబు, శ్రీనివాసులు రాజు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని టేలర్ హైస్కూల్ వారు విద్యార్థులకు సైకిల్ రేసు పోటీలను శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థుల సంగం గౌరవ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, విశిష్ట అతిథిగా ఆర్డీవో శ్రీనివాసరాజు హాజరై రేసును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమానాలు అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, టేలర్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు దయానిధి, సుదర్శన్, హఫీజ్, రూబీ, ప్రమోద్ కుమార్, ధౌసిఫ్, తోసిప్, నాగార్జున, మహమ్మద్ అహ్మద్, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య

బోరు బావి తవ్వకాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తం గ్రామంలో ప్రభుత్వం నూతన బోరు బావి తవ్వించడంతో తాగునీటి సమస్య తీరిందని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొద్దిరోజులుగా ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రజల సమస్యలు గుర్తించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం సమాచారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వారి చొరవతో నూతన గ్రామంలో బోరుబావిని త్రవ్వించి ప్రజల సమస్యను పరిష్కరించినట్టు తెలిపారు. తిమ్మప్ప, మునిరత్నం, రాము, వెంకటాచలం, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఓగా డిఎస్.హరిబాబు

ప్రజాశక్తి - సదుం: సదుం ఎంపిడిఓ కార్యాలయంలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డిఎస్.హరిబాబు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు సదుం ఇన్చార్జి ఎంపీడీవోగా శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన గత అక్టోబర్ నెలలో రేణిగుంట ఎంపీడీవో కార్యాలయం నుంచి సదుం ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. సదుం ఎంపీడీవో కార్యాలయానికి గత కొంతకాలంగా పులిచెర్ల గ్రామపంచాయతీకి చెందిన ఈఓపిఆర్‌డి జి.రాజశేఖర్ బాబు సదుం ఇంచార్జి ఎంపీడీవోగా కొనసాగుతుండగా శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డిఎస్ హరిబాబు ఇన్చార్జి ఎంపీడీవోగా శనివారం బాధ్యతలు తీసుకున్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ

ప్రజాశక్తి- సోమల: మండలంలో పల్లెపండుగ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా ఎంపిక చేసిన సిమెంటు రోడ్ల నిర్మాణం, గోకులం షెడ్లు, ఫారం పౌండ్ పనులను ఎంపీడీవో నారాయణ శనివారం తనిఖీ నిర్వహించి పనుల నాణ్యతపై ఉపాధి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నాణ్యతలో రాజీ లేకుండా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టే విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. అదేవిధంగా రైతులు తమకు కేటాయించిన గోకులం షెడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసే విధంగా కోరామని ఫారం ఫండ్ నిర్మాణాలలో కొలతలు ఇతర నియమ నిబంధనలు తప్పక పాటించే విధంగా ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ దినకర్ బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అస్తవ్యస్త విధానాలతోనే విద్యుత్ ఛార్జీల భారం

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు, సిఆర్ రాజన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం అనుసరించిన విధానాలతోనే నేడు ప్రజలు విద్యుత్ భారాలను మోయాల్సి వస్తోందని ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, నాయకులు సిఆర్ రాజన్, దొరబాబు అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం పదిసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. ప్రజల నెత్తిన భారాన్ని మోపిన జగన్, నాటి విద్యుత్‌శాఖ మంత్రి ఇంటి ముందు నిరసన కార్యక్రమాలు చేయాలని సూచించారు. వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వంపై అబద్ధ ప్రచారాలు చేస్తూ నిరసన కార్యక్రమాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో దినకరన్‌కు బహుమతి

జిడి నెల్లూరులో..

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులు దినకరన్ మొదటి బహుమతి గెలుపొందినట్లు శనివారం ఎంఈఓ ఆంజనేయులు శెట్టి తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో సైన్స్ ఉపాధ్యాయులు దినకరన్ ఎంతో అద్భుతంగా సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనను ప్రదర్శించారని ఈ గెలుపు పాఠశాలకు గర్వకారణమన్నారు.

పలమనేరులో..

పలమనేరు: శనివారం మండలంలోని ఉన్న అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతిలో విద్యార్థులకు మండలస్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన మండల విద్యాశాఖ అధికారులు పి.లీలారాణి, సి.బాలసుందరం, మండల నోడల్ హెడ్మాస్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాల నుండి ఇండివిజువల్ గ్రూప్, టీచర్ అను మూడు విభాగాల నుండి ఒక ఉత్తమ ప్రాజెక్టును మండల స్థాయికి తీసుకురావడం జరిగింది. న్యాయనిర్ణేతలుగా గవర్నమెంట్ జూనియర్ కళాశాల నుంచి ఫిజిక్స్ లెక్చరర్ ఏఎస్‌వి.కృష్ణారావు, జువాలజీ లెక్చరర్ ఎం.హేమప్రియ వ్యవహరించారు. వచ్చిన ప్రాజెక్టులలో గ్రూప్ ప్రాజెక్ట్ నుంచి కె.ఉదయ్ కిరణ్, జడ్పీహెచ్ఎస్ దొడ్డిపల్లె పాఠశాల విద్యార్థి ఈ.పూజితకి ప్రథమస్థాయి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాల విద్యార్థినికి పవన్ విద్యార్థి ద్వితీయ స్థాయి, జడ్పీహెచ్ఎస్ కొల్మాసనపల్లె తృతీయ స్థాయికి రావడం జరిగింది. అదేవిధంగా ఇండిజువల్ కేటగిరీలో ఆశశ్రీ గురుకుల పాఠశాల మొదటిస్థాయి, చరణ్ తేజ్ జడ్పీహెచ్ఎస్ దొడ్డిపల్లి పాఠశాల విద్యార్థికి ద్వితీయ స్థాయి, గౌతమ్‌రెడ్డి జెడ్‌పిహెచ్ఎస్ పెంగరగుంట పాఠశాల తృతీయ స్థాయిలోనూ, టీచర్ కేటగిరీలో డి.నాగేంద్ర మాథ్స్ (ఎస్సే) జెడ్పీహెచ్ఎస్ దొడ్డిపల్లె ప్రథమ స్థాయిలను మహమ్మదుల్లా జడ్పీహెచ్ఎస్ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్‌కి ద్వితీయ స్థాయి రావడం జరిగింది. జిల్లాస్థాయి సైన్సు ఫైర్ ప్రదర్శన ఈనెల 31ని జరుగుతుందని తెలిపారు. జడ్పీహెచ్ఎస్ కోల్మాసనపల్లె పాఠశాల హెడ్మాస్టర్ ఈశ్వర ప్రసాద్, జడ్పీ హెచ్ఎస్ దొడ్డిపల్లె హెడ్మాస్టర్ నేతాజీ, గవర్నమెంట్ ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ షంషీర్, గైడ్ టీచర్స్, సిఆర్‌పిలు రంజిత్ కుమార్, గీత, హరిబాబు పాల్గొన్నారు.



సదుంలో..

సదుం: సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ మేళాను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జయకుమార్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థులకు సైన్స్ పట్ల ఆధునిక ఆవిష్కరణలపై సైన్స్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి అభిరామ నాయక్, పాలమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వై.అరవింద్ జిల్లాస్థాయి సైన్స్ మేళాకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. సదుం ఇంచార్జ్ ఎంఈఓ1 సి.సిద్ధరామయ్య, ఎంఈఓ 2 టీ.దామోదర్ సైన్స్ మేళాను పరిశీలించారు.

చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారిని తిరుమలమ్మ కేశవరెడ్డి ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేశవరెడ్డి విద్యార్థులు నూతన ఒరవడిని సృష్టిస్తూ ముందుకు వెళ్లాలని తెలియజేశారు. నేటి విద్యార్థుల హృదయాంతరంగంలో నిరంతరం జ్వలించే చైతన్యమే జాతి పురోభివృద్ధికి ప్రతీక అని ప్రతి ఒక్క విద్యార్థి మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని తిరుమలమ్మ ఆకాంక్షించారు. ఈ ప్రదర్శన పోటీలకు న్యాయనిర్ణేతలుగా పిజిటి సుదర్శన్ కుమార్, విజయలక్ష్మి వ్యవహరించారు. ప్రథమవిజేత సి.ధనుష్ రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాగితి ద్వితీయ విజేత పూజశ్రీ శరణ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చారాల తృతీయ విజేత ఫాసుల్లా, ఎంపీ యుపిఎస్ కోటూరు విజేతలగా నిలిచారు. వీరికి బహుమతులను ప్రధానం చేశారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులు ఈనెల 30వ తేదీ చిత్తూరు జిల్లాలో జరిగే జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన పోటీలలో పాల్గొంటారని తెలిపారు. సిఆర్‌పిలు రఘు, లావణ్య, ఉపాధ్యాయులు ఆనంద్, సుబ్రహ్మణ్యం, ఉమాశంకర్ రెడ్డి, ప్రతిమ, శివప్రసాద్, పూర్ణిమ, జగన్మోహన్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఈశ్వర్, శ్రీనివాసన్, పరిమళ, కవిత పాల్గొన్నారు.

చౌడేపల్లిలో..

మహిళా రైతులకు అవగాహన

ప్రజాశక్తి- చౌడేపల్లి: సమీకృత వ్యవసాయ రంగంపై మహిళ కిసాన్ రైతులతో మండలంలోని పంచాయతీ కేంద్రం కాగతిలో సమావేశం జరిగింది. జిల్లా డిఆర్‌డిఏ ఏబీఎన్ ఎఫ్‌పిఓ వెంకటరమణ హాజరై మహిళా రైతులకు సమీకృత వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించారు. ఐఎఫ్‌సి క్లస్టర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి అనేక రకాల జీవనోపాధులు కల్పించి వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలని చెప్పారు. ప్రతి మహిళ కిసాన్‌గా మారి ఎఫ్‌పిజిలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఐకెపి అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో జిల్లా అధికారి తనిఖీలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు ఆరోగ్య ఉపకేంద్రంలో శనివారం జిల్లా గణాంకాల అధికారి వి.జార్జి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉప కేంద్రంలోని రికార్డులను, ఓపిని పరిశీలించారు. సిబ్బందిని శానిటేషన్‌పై ఆరా తీశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధి పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఉప కేంద్రం పరిధిలో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: కోకో కోలా సంస్థ, వైఫోర్ డిపౌండేషన్ వారి సహకారంతో రేడో స్వచ్ఛంద సేవాసంస్థ వారి ఆధ్వర్యంలో మండలంలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని రాయల్ మహల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 255 మంది ప్రజలకు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ సౌమ్య, డాక్టర రమణ హర్ష, శివకుమార్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం కంటివైద్య నిపుణులు అగర్వాల్స్ ఐ క్లీనిక్ వైద్యులు పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం వైద్య శిబిరంకు వచ్చిన రోగులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని దాసమానపల్లిలో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో ఆదివారం మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి 2 గంటల వరకు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోగల పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని రెస్కో ఎండి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి- సోమల: ఈ పంట నమోదు సక్రమంగా జరుగుతోందా లేదా అని రైతుల సమక్షంలో ఈ పంట నమోదు చేయించి ఈ పంట నమోదులో రైతుల పంటలను తప్పకుండా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయబుటశాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు విత్తనాలు గడువు తీరిన వాటిని అమ్మరాదని రైతుకు అమ్మిన వస్తువుకు సంబంధించి బిల్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో పుంగనూరు వ్యవసాయ సంచాలకులు శివకుమార్, ఇరికిపెంట మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు, సోమల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, ఆర్.బి.కె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

మాజీ ఎమ్మెల్సీ గౌనువారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- శాంతిపురం: మండలపరిధిలోని రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం రెవెన్యూ సదస్సును మాజీ ఎమ్మెల్సీ గౌనువారి శ్రీనివాసులు, మండల తహశీల్దారు జి.శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతుల భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని రైతులు తమ భూమికి సంబంధించిన వివిధ రకాల ఫిర్యాదులను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. తహశీల్దారు జి.శివయ్య, ఎస్సై నరేష్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, వీఆర్వో ప్రకాశ్, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్, సర్పంచ్ లక్ష్మి మురుగేష్ పాల్గొన్నారు.



పెద్దపంజాణిలో..

కుప్పం టౌన్: పట్టణంలోని 3,4 సచివాలయాల పరిధిలో తహశీల్దార్ చిట్టిబాబు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కృపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము హాజరయ్యారు. స్థానిక ప్రజలు భూసమస్యలపై అర్జీలను అందజేశారు. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు, సోము, సురేష్, టిడిపి మైనారిటీ విభాగం కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, జనసేన కన్వీనర్ నరేష్, బిజెపి కన్వీనర్ శివశంకర్, సురేష్, వాసు, జయరామ నాయుడు, టిడిపి మహిళలు భాగ్యలక్ష్మి త్రిలోక్, తిరుమగళ్, శాంతమ్మ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని రైతుల భూసమస్యలను పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహశీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం మండలంలోని అమ్మరాజుపల్లి పంచాయతీ సచివాలయ పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తహశీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



శాంతిపురంలో..

సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 54 అర్జీలు వచ్చినట్టు తహశీల్దార్ బెన్ను రాజ్ తెలిపారు. వీటిలో భూసమస్యలు అధికంగా వచ్చాయని మిగిలినవి ఇతర శాఖలకు చెందినవని, మిట్టపల్లి గ్రామంలో రీ సర్వే నిర్వహించాలని రైతులు అర్జీ ఇచ్చినట్టు తెలిపారు. సర్పంచ్ భాషా మసూద్, టిడిపి మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, ఆర్ఐ, సర్వేయర్ రైతులు పాల్గొన్నారు

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ నిర్వహణ

అభ్యంతరాల స్వీకరణ: ఎంపీడీవో

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఉన్న ఎస్సీల జనాభా, వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించు నిమిత్తం ఎస్సీ కులగణన వివరాలను ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరిస్తారని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి జనవరి 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న తుది వివరాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించబడుతాయని తెలియజేశారు. కుల గణనపై మూడు దశల్లో తనిఖీలు ఉంటాయని, పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యాలు, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారని వివరించారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్ఓ పరిశీలించి, ఆర్ఐకి నివేదిస్తారన్నారు. వీటిని ఆర్ఐ పునఃపరిశీలించి తహశీల్దార్‌కు రికమండ్ చేస్తారన్నారు. అనంతరం తహశీల్దార్, వీఆర్ఓ, ఆర్ఐల నివేదికలో వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి, ఆ వివరాలు భద్రపరుస్తామని తెలిపారు. ఈ వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50మంది వివరాలను ర్యాండమ్‌గా తనిఖీ చేస్తామని, సోషల్ ఆడిట్‌ను కలెక్టర్, ఆర్డీఓలు పర్యవేక్షిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

రాజ్యాంగ హక్కులపై ఉద్యమిద్దాం

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్: దేశంలో నానాటికి అడుగంటి పోతున్న రాజ్యాంగ హక్కుల కోసం మరొక దేశ వ్యాప్త పోరాటం అవసరమని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి. సాను పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రకాశం భవనం ఎదుట జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆర్ట్స్‌బ్లాక్ ఆడిటోరియంలో 'ప్రాథమిక హక్కులు, లౌకిక సామ్యావాద విలువలు' అంశంపై రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షులు అక్బర్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. దేశంలో రాజ్యాంగ విలువలు ఉల్లంఘిస్తూ దాడులు పెద్దఎత్తున పెరిగాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పెద్దఎత్తున డ్రాపౌట్ అవుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వ నూతన విద్యా విధానం అసమానతలు సృష్టించి, బడుగులకు విద్యను మరింత దూరం చేసిందన్నారు. జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ అందరికీ రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం లభించినప్పుడే రాజ్యాంగం పరిపూర్ణత సాధిస్తుందన్నారు. నేటి విద్యార్థులు ఆ రాజ్యాంగం హక్కులు కోసం పరితపించాలని అన్నారు. మాజీ జిల్లా కార్యదర్శి మాధవ కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, అశోక్, తేజ, సహాయకార్యదర్శి బాల, సుష్మిత, వీరేష్ పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న జాతీయ నాయకులు సాను

ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండావిష్కరణ

క్రైం న్యూస్

చాట్ బాట్ యాప్ ద్వారా

450 సెల్‌ఫోన్స్ రికవరీ

రికవరీ చేసిన సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పది రోజుల వ్యవధిలో రూ.90 లక్షలు విలువ గల 450 మొబైల్ ఫోన్లను చాట్ బాట్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి మొబైల్ ఫోన్ల రికవరీ చేస్తున్నట్లు చెప్పారు. శనివారం పోలీస్ గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్లో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేసి పదవ దశలో రికవరీ చేసిన సుమారు 90 లక్షల విలువగల 450 మొబైల్ ఫోన్‌లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలిలో మొబైల్ వినియోగం ఎక్కువ అయ్యి మనలో ఒకటిగా మారిపోయిన మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారు ఎటువంటి కంప్లయింట్ లేకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఇంట్లో కూర్చొని చిత్తూరు పోలీసు వారి చాట్ బాట్ యాప్ సేవల ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను మరలా పొందవచ్చునని తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు మహిళలు అరెస్టు

నిందితులను చూపుతున్న టూ టౌన్ సిఐ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తోటి ప్రయాణికులా ఆటో ప్రయాణం చేస్తూ ఆటో ఉన్న ఓ మహిళ వద్ద ఉన్న బ్యాగులోని బంగారు ఆభరణాలు చోరీ చేసి చిత్తూరుకు చెందిన మేకల దుర్గ, తోట లత, గంట లలిత చిత్తూరు మంగసముద్రంకు చెందిన ముగ్గురు మహిళలను టూ టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సిఐ నెట్టి కంటయ్య వివరాల మేరకు ఈ నెల 26వ తేదీ యాదమరి మండలం, యెర్రచెను గ్రామానికి చెందిన జ్ఞానమ్మ వయస్సు (65) అనే వృద్ధురాలు చిత్తూరు టౌన్ రామ్‌నగర్ కాలనీలోని తన కొడుకు ఇంటికి వచ్చి అదే రోజు మధ్యాహ్నం 12.20 గంటల ప్రాంతంలో చిత్తూరు టౌన్ దర్గా సర్కిల్ వద్ద యాదమరికి వెళ్ళేందుకు ఆటో ఎక్కి వెళుతూ ఉండగా కాజూరు సర్కిల్ వద్ద ఎవరో గుర్తు తెలియని ముగ్గురు మహిళలు ఆటోలో ఎక్కారు. వీరు మార్గ మధ్యలోనే ఏదో పని ఉందంటూ దిగిపోయారు. యాదమరి వరకు వెళ్లిన జ్ఞానమ్మ తన బ్యాగును చూసుకోగా డబ్బు, నగలు మాయమైన విషయం గుర్తించి అదే రోజు చిత్తూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెండు రోజుల వ్యవధిలో చోరీ కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి డబ్బు, బంగారు ఆవరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

మద్యానికి బానిసై యువకుడు మృతి

ప్రజాశక్తి -సదుం: మద్యానికి బానిసై, ఉన్నత చదువులు చదువుకున్న యువకుడు మరణించిన సంఘటన శనివారం సదుంలో వెలుగులోకి వచ్చింది. ఎస్సై షేక్‌షావల్లి తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాలమంద చింతలవారిపల్లి గ్రామానికి చెందిన మునెమ్మ శనివారం సదుం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన కొడుకు ఇంట్లో చనిపోయి పడి ఉన్నాడని, తన కొడుకు మరణం పట్ల అనుమానంగా ఉన్నదని సదుం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ పోలీస్ సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లి విచారించగా జి.మధు కుమార్ తన ఇంట్లోనే చనిపోయి వున్నాడని తెలిపారు. జి.మధుకుమార్ అదే గ్రామానికి చెందిన రెహనా అనే మహిళను 11 సంవత్సరాల క్రితం వివాహం చేసుకొన్నాడు, మధుకుమార్ ఇంజనీరింగ్ చదువుకొని, హైద్రాబాద్ నగరంలో కొంత కాలం పనిచేశాడని వీరికి చైత్రసాయి (8), విష్ణు వర్ధన్ (6) సంవత్సరాల ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. మధు కుమార్ శుక్రవారం కూడా ఎక్కువగా మద్యం తాగి ఇంట్లోనే పడి ఉన్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. మృతుకి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు.

16 మందికి రూ.1,60,000లు జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు శుక్రవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 16 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి 16 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం రూ.1,60,000లు జరిమానా విధించడం జరిగింది. ఈ 11 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 667 మందికి సుమారు రూ.66.7 లక్షలు జరిమానా విధించడం జరిగింది.

అందాల పోటీల్లో

పాదిరేడు యువతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: జాతీయ స్థాయి అందాల పోటీలు 2024లో వడమాలపేట మండలం పాడిరేడుకు చెందిన అల్లూరు సుజన మిస్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ అవార్డును దక్కించుకున్నారు. ఈనెల 21న న్యూఢిల్లీ పశ్చిమ విహార్ హోటల్లో జాతీయస్థాయి అందాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సుజన ఫస్ట్‌రన్నరప్‌గా నిలిచారు. సుజన కలికిరి జెఎన్‌టియూలో గ్రాడ్యుకేషన్ పూర్తి చేశారు. కాగ్నిజెంట్ సంస్థలో ఉద్యోగావకాశం వచ్చినట్లు ఆమె చెప్పారు. తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయురాలు పార్వతి, సెరికల్చర్ ఆఫీసర్ సుబ్రమణ్యం. వారి ప్రోత్సాహంతోనే తనకు ఈ అవార్డు దక్కిందని ఆమె 'ప్రజాశక్తి'కి తెలిపారు.